115) భూపాళం

ప॥ ఆకాశ మడ్డమా అవ్వలయు నడ్డమా । శ్రీకాంతు భజియించు సేవకులకు ॥

చ॥ పాతాళ మడ్డమా బలిమథన దాసులకు । భూతలం బడ్డమా పుణ్యులకు ।
సేతు కైలాసములు చిర భూములన్నియును । పైత్రోవలట పరమ భాగవతులకును ॥

చ॥ అమరావతడ్డమా హరి దాసులకు మహా- । తిమిరంబు లడ్డమా దివ్యులకును ।
కమలాసనుని లోకం బదియు నడ్డమా । విమలాత్ములై వెలుగు విష్ణుదాసులకు ॥

చ॥ పరమ పద మడ్డమా బ్రహ్మాండ ధనుడైన । ధర వేంకటేశ్వరుని దాసులకును ।
యిరవైన లోకము లన్నిటా భోగించి । వరుసలను విహరించు వర వైష్ణవులకు ॥